19890224

# పౌరహక్కుల ఉద్యమ సారథితో ఇంటర్వ్యూ

'నేను అప్పుడే, ఆ క్షణమే చంటి పిల్లాడినైపోయాను. ఎందుకో తెలుసా? ఆ క్షణమే అర్థమైంది- నా ప్రజలకు జీవితమే లేకుండా చేశారని, చావడానికి సమాధుల్ని కూడా నిషేధించారని!'

—పాబ్లో నెరుడా

రాష్ట్రంలో క్షణక్షణానికి క్షీణించిపోతున్న పౌరహక్కుల కోసం తీవ్రంగా కృషి చేస్తున్న వారిలో డాక్టర్ బాలగోపాల్ ఒకరు.

క్షీణించిపోతున్న పౌరహక్కుల రక్షణకై చేస్తున్న కృషిలో ఎన్నో చేదు అనుభవాలను చవిచూసినా వెనుకంజవేయక, పౌరహక్కుల ఉద్యమ సారథిగా ముందుకు సాగుతున్న డా॥ బాలగోపాల్‌తో చక్రవర్తి ముఖాముఖి.



● 15 సంవత్సరాల నుంచి దేశంలో పౌరహక్కుల సంస్థలు పనిచేస్తున్నా వీటి ప్రభావం ప్రజలలో తక్కువగానే ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పౌరహక్కుల గురించి ప్రజలలో చైతన్యం పెరుగుతుందంటారా?

○ పౌరహక్కుల గురించి ప్రజలలో చైతన్యం ఖచ్చితంగా పెరుగుతూవుంది. అది ప్రభుత్వ దమనకాండకు సరితూగే స్థాయిని ఇప్పటికీ అందుకోని మాట వాస్తవమే. అయినప్పటికీ పెరుగుతున్న చైతన్యం పౌరహక్కుల ఉద్యమానికి విజయంగానే భావిస్తాం.

● మీ నిజనిర్ధారణ కమిటీ ప్రతి సంఘటనలోనూ పోలీసు యంత్రాంగాన్ని దోషిగా నిలబెడుతుంటుంది. ప్రజలపై సాగే అరాచకాలన్నింటికి వారే బాధ్యులని ఏ విధంగా చెప్పగలరు?

○ మేము పోలీసు యంత్రాంగాన్ని దోషిగా నిలబెట్టడంలేదు. పోలీసు యంత్రాంగాన్ని ఆ విధంగా తయారుచేసిన రాజ్యాంగ యంత్రాన్ని,- అంటే సులభమయిన భాషలో చెప్పాలంటే ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడుతున్నాం. ప్రభుత్వం తన పాలనా వైఫల్యాలను కప్పిపెట్టుకోవడానికి పోలీసు యంత్రాంగానికి విచ్చలవిడి అధికారం ఇస్తోంది. అత్యాచారాలు చేయడాన్ని ప్రోత్సహిస్తోంది. మేము ఆ విధానాన్ని తప్పుపడుతున్నాం.

● పౌరహక్కుల సంస్థలంటే నక్సలైట్ల సంస్థలకు అనుబంధ శాఖలని కొన్ని వర్గాల ప్రజల్లో అభిప్రాయాలున్నాయి. అదిగాక నక్సలైట్ల హత్యాచారాలను మీరు ఖండించరని ప్రభుత్వం ఆరోపణ. వీటికి మీ సమాధానం?

○ పౌరహక్కుల సంఘాలు ఎవ్వరికీ అనుబంధ సంస్థలు కావు. నక్సలైట్ల మీద, వాళ్ళ సానుభూతిపరుల మీద ఎక్కువగా ప్రభుత్వ దమనకాండ జరుగుతుంటుంది కాబట్టి ఎక్కువగా వారి హక్కుల గురించే మాట్లాడవలసి వస్తోంది. నిజానికి 'ఏ.పి. పి.యల్.సి.' ఈ రోజు ఎక్కువగా చేస్తున్న పనికి ఏ రాజకీయ పక్షంతో సంబంధంలేదు. లాకప్పు మరణాలు, వాతావరణ కాలుష్యం, ఎన్‌కౌంటర్ హత్యలు, దళితులపైన అత్యాచారాలు— ఇవేవీ నక్స

లైట్లకు సంబంధించిన విషయాలు కొన్ని.

నక్సలైట్లు చేసే హత్యల మాటకొస్తే మేము వాటినే కాదు. ఏ రాజకీయ హత్యను ఖండించడం లేదు. నిజానికి మన రాష్ట్రంలో గత మూడేళ్ళుగా నక్సలైట్లు చేసిన హత్యల కంటే కాంగ్రెస్ (ఐ)- తెలుగుదేశం పార్టీలు చేసుకున్న హత్యలే ఎక్కువ. మేము వాటిని కూడా ఖండించ లేదు. ఎందుకంటే- వాటి మీద విచారణ నిర్వహించడానికీ, కేసులు పెట్టడానికీ ఒక పోలీసు యంత్రాంగం వుంది. శిక్షించడానికి కోర్టులున్నాయి. అయితే పోలీసులే హత్యలు చేస్తే లేక ప్రభుత్వమే అత్యాచారాలు చేస్తే శిక్షించడానికి ఏ యంత్రాంగమూ లేదు.

● నిజానికి పౌరహక్కుల సంఘాల మధ్య మిత్రుత్వ వైరుధ్యం వుండాలి కదా! కాని ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ శత్రుత్వ వైరుధ్యాన్ని ప్రకటిస్తున్నారెందుకు?

○ పౌరహక్కుల సంఘాల మధ్య ఏ రకమయిన వైరుధ్యాలు ఇప్పుడు లేవు. ఈ మధ్య చాలా విషయాలలో కలిసి పనిచేస్తున్నాయి. ఒకరిపైన ఒకరు నిందలు వేసుకోవడమనేది లేనేలేదు.

● రాజకీయ వ్యవస్థకు సమాంతర పోటీగా కులవ్యవస్థ నెలకొన్న నేటి పరిస్థితులలో పౌరహక్కుల సంఘాల పాత్ర ఏమిటి?

○ అగ్రవర్ణాల వాళ్ళు దళితుల మీద చేసే దాడులను పౌరహక్కుల సమస్యగా పరిగణించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆ క్రమంలోనే కారంచేడులో హరిజనులపై అగ్రవర్ణాలవారు జరిపిన హత్యాకాండ నుండి ఇప్పటిదాకా జరిగిన అన్ని సంఘటనల గురించి కూడా పౌరహక్కుల సంఘం తరపున మేము చేయగలిగిన కృషి- మీటింగులు, కరపత్రాలు, పత్రికా ప్రకటనలు, కోర్టుతో సహాయం చేస్తున్నాం. నేటి సమాజంలో వేళ్ళూ కూరుకుపోయిన ఇతరత్రా కులరాజకీయాలతో మాకు ఎటువంటి ప్రమేయం లేదు.

● రాబోయే కాలంలో దేశంలో పౌరహక్కుల ఉద్యమ ప్రభావం ఏ విధంగా ఉంటుంది?

○ రాబోయే కాలంలో దేశంలో ఫాసిస్టు ధోరణులు బాగా పెరుగుతాయనే అనుకుంటున్నాము. పౌరహక్కుల ఉద్యమం అపపరం చాలా తీవ్రంగా ఉంటుంది. ఉద్యమ ప్రభావం మేము చేసే కృషిని బట్టి ఉంటుంది.

ఇంటర్వ్యూ: కొత్త చక్రవర్తి